క్లుప్తంగా

15న శిక్షణ శిబిరం

రామచంద్రపురం: విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి కల్పించేందుకు రామచంద్రపురం లయన్స్ క్లబ్, రేవతి సైన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 15న స్థానిక ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు భౌతిక రసాయన శాస్త్ర పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రయోగాలతో కూడిన శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని బుధవారం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ జీఎస్ఎస్ గోపాలకృష్ణ, క్లబ్ జోన్ చైర్మన్ కె.వంశీ మోహన్‌కృష్ణ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని, ముందుగా పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు.

దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం



అంగర విజయదుర్గాంబిక ఆలయం వద్ద రాట వేస్తున్న ప్రజాప్రతినిధులు, నిర్వాహకులు

కపిలేశ్వరపురం: అంగరలోని శ్రీవిజయదుర్గాంబిక అమ్మవారి ఆలయం వద్ద దసరా ఉత్సవాల నిర్వహణలో భాగంగా పందిరి రాట చేశారు. ఆలయ అర్చకుడు కొలువులు మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఉత్సవ నిర్వాహక కమిటీ సభ్యుల పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు. సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, చేనేత సహకార సంఘం చైర్మన్ గుడిమెట్ల శివరామకృష్ణ, యానాల రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్ర ఉత్సవాలకు ఏర్పాట్లు

మండపేట: పట్టణంలోని రథం గుడిలో కొలువైన బాలా త్రిపుర సుందరీదేవి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలకు ఘనంగా ఏర్పాటు చేస్తున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఈనెల 15 నుంచి 24 వరకూ నిర్వహించే ఉత్సవాలను ఆదివారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభిస్తారన్నారు. తొమ్మిది రోజులు తొమ్మిది రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయన్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని వేడుకలను విజయవంతం చేయాలని ఆలయ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

ప్రమాదాలపై అప్రమత్తత అవసరం



అంగర హైస్కూల్‌లో ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కపిలేశ్వరపురం: సహజంగా, మానవ తప్పిదాల కారణంగా సంభవించే ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండపేట అగ్నిమాపక కేంద్రం అధికారి జె.హనుమంతరావు అన్నారు. అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం విపత్తులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు మానవ తప్పిదాల కారణంగానే సంభవిస్తున్నాయన్నారు. అవగాహనతో వాటిని నివారించవచ్చన్నారు. హెచ్ఎం అంగర రాజు, పీఏసీ చైర్మన్ శలా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందజేత



అద్దంకివారిలంకలో మృతుని కుటుంబ సభ్యులకు బీమా సొమ్ము అందిస్తున్న ప్రజాప్రతినిధులు

కపిలేశ్వరపురం: అద్దంకివారిలంక గ్రామానికి చెందిన గూటం ప్రసాద్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబంలోని నామినీకి వైఎస్సార్ బీమా పథకంలో రూ.లక్ష మంజూరైంది. ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా బుధవారం తొలి విడతగా రూ.10 వేలను అందజేశారు. సర్పంచ్ నాతి గవరయ్య, వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కొండేటి వెంకన్న, కార్యదర్శి సీహెచ్‌వీవీ నరసింహారావు, వెల్ఫేర్ అసిస్టెంట్ దివాకర్ పాల్గొన్నారు.

ప్రణాళిక, కృషితోనే లక్ష్య సాధన

రాజానగరం: ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు సరైన ప్రణాళిక ఉండాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో బీటెక్ ఫస్టియర్‌లో ప్రవేశించిన విద్యార్థులతో బుధవారం దీక్షారంభ్ కార్యక్రమం నిర్వహించారు. జూనియర్ల విద్యార్థులకు సీనియర్లు మార్గదర్శకులుగా నిలబడి, వారి లక్ష్యసాధనకు తోడ్పడాలని సూచించారు. క్రమశిక్షణతో కూడిన విద్య సమాజంలో ఉన్నత స్థాయిని చేరుకునేందుకు ఉపయోగపడుతుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు.

భావి భారతావనికి సంరక్షణ

- చిట్టి తల్లుల సంక్షేమానికి ప్రభుత్వాల కృషి
- బాలికలకు భరోసాగా సచివాలయ వ్యవస్థ
- స్కూళ్లలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది
- పలు రంగాల్లో రాణిస్తున్న విద్యార్థినులు



వల్లూరు పాఠశాలలో చిన్నారులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీస్



అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉచిత ఆర్టీసీ బస్సు పాసులతో విద్యార్థినులు

కపిలేశ్వరపురం: భవిష్యత్తు భారతావనికి నేటి బాలికలు చోదక శక్తి. వారి నడవడిక, వారిలోని సమర్థత దేశ ఔన్నత్యానికి ప్రగతి రథ చక్రాలు. అంతటి ప్రాధాన్యత గల బాలికల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశేషంగా పాటుపడుతున్నాయి. తల్లి గర్భంలో ఉన్నప్పుడే తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు విశేష కృషి చేస్తున్నాయి. నవ మాసాల పాటు తల్లీ బిడ్డల పోషణ, సురక్ష ప్రసవం, బాలింతల బాగోగులు, చిన్నారుల సంక్షేమం, చిట్టి చెల్లెమ్మల చదువు బాధ్యత, వివాహ సమయానికి కానుక, సంసార బాధ్యతల్లో సైతం వివిధ సంక్షేమ ప థకాల ద్వారా సాయం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుంది. ఇతర రాష్ట్రాల్లో లేని విధంగా అమ్మ ఒడి లాంటి పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుంది.

వివిధ రంగాల్లో రాణిస్తూ..

చదువుకుంటూనే విద్యార్థినులు ఆట పాటల్లోనూ, విద్యా, వైజ్ఞానిక రంగాల్లో రాణిస్తున్నారు. రామచంద్రపురం రూరల్ మండలం వెలంపాలేనికి చెందిన తలాటం సూర్య భవిత ఉమ్మడి తూర్పు గోదావరి స్థాయి వక్తృత్వ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. సెప్టెంబర్‌లో అన్ని మండలాల్లో నిర్వహించిన స్కూల్ గేమ్స్ పోటీల్లో చిన్నారులు పలు విభాగాల్లో విజేతలుగా నిలిచారు. రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కె.గంగవరం మండలం కుందూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని గుబ్బల కుందన లక్ష్మీ ప్రియ ఎంపికైంది.

బాలికా రక్షణే ధ్యేయంగా..

రెండు నియోజకవర్గాల్లోని సచివాలయాల్లో బాలికా సంరక్షణ కార్యక్రమాలు చేపడుతున్నారు. మహిళా పోలీసులు తన పరిధిలోని పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించి గుడ్ టచ్, బ్యాడ్ టచ్, దిశ చట్టం ప్రాధాన్యత, సమాజ తిరోగమన పరిస్థితులపై అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థులకు ప్రత్యేక వ్యాయామ తరగతులను నిర్వహించి క్షేత్ర స్థాయిలో దాడి జరిగినపుడు ఎదుర్కొనే పద్ధతులను వివరిస్తున్నారు. కళాశాలల్లో పెళ్లి వయసు, సెక్స్‌పై అవగాహన, సినిమా సీరియల్స్ ప్రభావాలు, నివాస ప్రాంతాల్లో సామాజిక పరిస్థితులపై అవగాహన కల్పిస్తున్నారు. కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా ఆపదలో ఉన్న బాలికల రక్షణకు చైల్డ్ లైన్ పేరుతో కృషి చేస్తోంది. లింగ నిర్ధారణ పరీక్షలు దుర్వినియోగం కాకుండా పటిష్టమైన చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది.

బాలికలు ఆరోగ్యంగా ఉండాలని..

జగనన్న గోరుముద్ద పథకం పేరుతో పోషక విలువలు, రుచిగల భోజనాన్ని అందిస్తూ బాలికల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోంది. విద్యార్థినుల వయసుకు తగిన ఎత్తు, బరువు ఉన్నారా లేదా పౌష్టికాహారం లభ్యతపైనా వైద్య ఆరోగ్య, ఐసీడీఎస్ సంస్థలు పర్యవేక్షిస్తున్నాయి. రెండు నియోజకవర్గాల్లో 511 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వాటి ద్వారా చిన్నారులకు పోషక విలువలున్న ఆహారం అందిస్తోంది. తల్లిపాల వారోత్సవాల పేరుతో చిన్నారుల ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి సారించింది.

సామాజిక ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



బాలిక జీవితం ఒంటరి అంశం కాదని అందరూ గుర్తించాలి. సమాజంలో ప్రతి అంశానికి ప్రతి ఒక్కరూ ప్రభావితం అవుతారు. ఆ నేపథ్యంలో సమాజంపై అవగాహన పెంచుకోవాలి. సామాజిక అంశాలను నిత్యం తెలియజెబుతూ ఉండాలి.

– డాక్టర్ చల్లా రవికుమార్, హోమియో వైద్యుడు, మండపేట

బాల్యం నుంచే అవగాహనతో మెలగాలి



చిన్నారి జీవితం అమ్మ గర్భం నుంచి ప్రారంభం అవుతుంది. తర్వాత కాలంలో కుటుంబ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. చిన్ననాటి నుంచి అవగాహనతో మెలగడం ద్వారా బాలిక జీవితం మెరుగవుతుంది.

– పుల్లేటికుర్తి నాగసుమ హర్షిణి, మాచర

చదువుతో సమాజంలో గుర్తింపు



చదువే మానవాళికి మార్గదర్శకం. నాణ్యమైన చదువు మనిషి జీవితాన్ని మెరుగుపరుస్తుంది. చదువుకున్న రోజుల నుంచి జీవిత ప్రయాణంపై స్పష్టత కలిగి ఉండాలి. అందుకు చదువే ఆధారం.

– కావూరి జీవిత, టేకి

పరిస్థితులను ఎదుర్కొనే శక్తి అవసరం



ఆడపిల్ల జీవితం గౌరవప్రదమైనది. ఆధునిక కాలంలో సామాజిక పరిస్థితులు మహిళలకు ప్రతికూలంగా ఉంటున్నాయి. వాటిని ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలు కలిగి ఉండాలి. అన్ని రంగాల పట్ల అవగాహన పెంచుకోవాలి.

– చీకట్ల యామిని శ్రీవల్లి, టేకి

ప్రజారోగ్యమే ప్రతి ఇంటికీ సౌభాగ్యం

- మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ
- గ్రామాల్లో పలుచోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు



తాళ్లపాలంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: ప్రజారోగ్యమే ప్రతి ఇంటికీ సౌభాగ్యం అనే నినాదంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. రామచంద్రపురం మండలం తాళ్లపాలంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మంత్రి వేణు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా సీఎం జగన్ పేదలకు కొండంత అండగా నిలుస్తున్నారన్నారు. నాడు మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకంతో పేదలను ఆదుకున్నారన్నారు. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో పదడుగులు ముందుకు వేసి వైద్య సేవలను ఇంటి ముంగిటకు చేరుస్తున్నారన్నారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో ప్రజలకు అందించిన సేవలను పరిశీలించారు. గ్రామ సర్పంచ్ కట్టా గోవిందు, ఉప సర్పంచ్ వల్లు శివ, ఎంపీటీసీ పంపన ఏడుకొండలు, పానకాలు, మేడిశెట్టి విజయభాస్కర్, ఎంపీడీఓ ఎస్.కీర్తిస్పందన, తహసీల్దార్ జి.శ్రీనివాసు, ఈఓపీఆర్డీ ఎస్.షెలత్‌రాజు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

కాజులూరు: ప్రజారోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి జగన్ ఎంతగానో కృషి చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకట సుబ్బారావు అన్నారు. పల్లిపాలెం గ్రామ సచివాయం–2 ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. దుగ్గుదుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి వై.సుప్రియ ఆధ్వర్యంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు నాగార్జున, బి.ప్రవీణ, వై.సుప్రియ, సీపీఎల్ శ్రేయ, సురేఖ తదితరులు పాల్గొని 436 మందికి వైద్య పరీక్షలు చేశారు.

480 మందికి వైద్య పరీక్షలు

కపిలేశ్వరపురం: అద్దంకివారిలంకలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. వివిధ విభాగాలకు చెందిన నిపుణులు 480 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ సేవలను ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు, వీరవల్లిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎన్.సునీల్, లక్ష్మీసౌజన్య, అయినవిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డి.క్రిస్టోఫర్ పరిశీలించారు. ఐసీడీఎస్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి పర్యవేక్షణలో అంగన్‌వాడీలు పోషకాహార ప్రదర్శన చేపట్టారు. సర్పంచ్ నాతి గవరయ్య, వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కొండేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కె.గంగవరం: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. కె.గంగవరంలోని రామాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సేవలను ఉచితంగా చేయిస్తున్నారన్నారు. డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, సర్పంచ్ కోటి లక్ష్మీనరసమ్మ, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు బత్తుల అప్పారావు, బీసీ నాయకుడు పంపన సుబ్బారావు, సొసైటీ అధ్యక్షులు ఈదర రమేష్ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి శ్రీరామరక్ష

మండపేట: పేదల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు అన్నారు. మండలంలోని అర్తమూరులో బుధవారం సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మండల మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి వెంకన్నబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిబిరంలో 557 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద 10 మందికి మంజూరైన కళ్లజోళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా ఎంపీడీఓ ఐ.రాజు, ఈఓ అనిల్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ బందెల సాయిరాం పాల్గొన్నారు.



అర్తమూరులో కళ్లజోళ్లు అందిస్తున్న వెంకన్నబాబు, సర్పంచ్ అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి



వెంటూరులో రోగులకు ఉచితంగా మందులు అందజేస్తున్న పృథ్వీరాజ్

రాయవరం: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని వైఎస్సార్ సీపీ యువ నేత తోట పృథ్వీరాజ్, మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. మండలంలోని వెంటూరులో సర్పంచ్ వాసంశెట్టి వెంకట్రావు అధ్యక్షతన బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరానికి హాజరైన 241 మంది రోగులకు వైద్యులు సేవలందించారు. పార్టీ యువ నేత పృథ్వీరాజ్ కూడా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నున్న కృష్ణ ప్రదీప్, ఎంపీటీసీ సభ్యుడు వాసంశెట్టి విజయకుమార్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతో సంక్షేమ కాంతులు

- మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ
- కోలంక, పెదలంకలలో గడప గడపకూ..



పెదలంకలో పథకాల లబ్ధిని మహిళలకు వివరిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

కాజులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ కాంతులు వచ్చాయని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని కోలంక, పెదలంకలో బుధవారం మంత్రి వేణుగోపాలకృష్ణ, ఆయన తనయుడు నరేన్‌లు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వలంటీర్లు, పార్టీ కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా ఏఏ కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందో వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అంతేకాకుండా దళారుల ప్రమేయం లేకుండా నేరుగా వాటిని లబ్ధిదారులకు అందజేయడంలో సఫలీకృతులయ్యారన్నారు. దీనికి వలంటీర్ వ్యవస్థ ఎంతగానో దోహదపడుతుందన్నారు. గ్రామాల్లోనే సమస్యలను పరిష్కరించుకునే వీలుగా సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి అన్నిశాఖల అధికారులను ప్రజలకు అందుబాటులో ఉంచారన్నారు. ఇంత చక్కని పాలన నిరంతరం అందాలంటే రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీని మరోసారి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకట సుబ్బారావు, ఎంపీపీ మాత భారతి, మేడిశెట్టి చంటి, పీఏసీఎస్ చైర్మన్ తొగరు శేఖర్‌బాబు, ఎంపీటీసీ పంపన పద్మావతి, టేకుమూడి దుర్గారావు, యాళ్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ తోటను విమర్శించే స్థాయి లేదు



మీడియాతో మాట్లాడుతున్న పార్టీ నేత పాలంగి కమల తదితరులు

మండపేట: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా మండపేట నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును విమర్శించే స్థాయి జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణకు లేదని వైఎస్సార్ సీపీ నేతలు మండిపడ్డారు. స్థానిక గొల్లపుంత కాలనీలో లీలాకృష్ణ తమ పార్టీకి సంబంధం లేని వారిని జనసేన పార్టీలో చేర్చుకుని వైఎస్సార్ సీపీకి చెందిన వారిగా ప్రచారం చేసుకోవడం చౌకబారు రాజకీయాలకు నిదర్శనమన్నారు. కాలనీకి చెందిన పార్టీ నేతలు పాలంగి కమల, పేరూరి మాధవి, కోనాల చంద్రబోస్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలో గత పాలకులు ఎవరికి సాధ్యం కాని ఎన్నో దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపిన ఘనత ఎమ్మెల్సీ తోటకు దక్కుతుందన్నారు. మండపేటలో డంపింగ్ యార్డుకు స్థల సేకరణ, ద్వారపూడి రోడ్డులో అభివృద్ధి, రైతుల కోసం పుంత రోడ్ల అభివృద్ధి కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. గొల్లపుంత కాలనీలో అభివృద్ధి జరగలేదని లీలాకృష్ణ చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. కోవిడ్ కష్టకాలంలో కనీసం కాలనీకి వచ్చి ప్రజలను లీలాకృష్ణ పలకరించింది లేదన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి కాలనీలో ప్రజావసరాలకు అనుగుణంగా రోడ్లు, డ్రైన్లు, వీధిదీపాలు తదితర సమస్యలు పరిష్కరిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నారన్నారు. తమ నాయకులపై ఆరోపణలు చేస్తే సహించేది లేదని కమల హెచ్చరించారు. పార్టీ నాయకులు గుమ్మిలేరు శ్రీను, యాదగని చంటి, మల్లవరపు శ్రీనివాస్, ఆకుల దుర్గ, తేతలి సత్య, కొమ్మోజు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సేవలను వినియోగించుకోండి



ఏరియా ఆసుపత్రిలో పౌష్టికాహారాన్ని అందిస్తున్న మూర్తి తదితరులు

రామచంద్రపురం: ఏరియా ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు తొగరుమూర్తి తెలిపారు. జమాతే ఇస్లామీ హింద్ సంస్థ ఆధ్వర్యంలో ప్రవక్త మహ్మమద్ జన్మదినం సందర్భంగా బుధవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తొగరు మూర్తి మాట్లాడుతూ మంచి కార్యక్రమాన్ని నిర్వహించిన ముస్లిం పెద్దలకు, మహిళలకు అభినందనలు తెలిపారు. గతంలో ఐదుగురు వైద్యులు మాత్రమే ఉండే ఏరియా ఆసుపత్రిలో మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని 27 మంది వైద్యులను, రెండు ఆక్సిజన్ ప్లాంట్లను, బ్లడ్ బ్యాంకు, ఆధునిక లేబొరేటరీ మెషీన్లను అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. చర్మ వ్యాధుల, కంటి, దంత, ఆర్థోపెటిక్, ఫిజియోథెరపీ తదితర వైద్యులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మంత్రి వేణు నియమించారన్నారు. జమాతే ఇస్లామిక్ హింద్ సంస్థ ప్రెసిడెంట్ షరీఫ్ అహ్మద్, వైస్ ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్ రెహమాన్, సెక్రటరీ అలీ, షేక్ షరీన్, షేక్ అహ్మద్ ఉన్నీసా, షేక్ తాజుద్దీన్ ఉన్నీసా, షేక్ శంషాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పిండి సురేష్, చంటి పిల్లల వైద్యులు చక్రధర్, ఎస్ఎస్ జయప్రద తదితరులు పాల్గొన్నారు..

బీజేపీ ఆధ్వర్యంలో నా భూమి.. నా దేశం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో నా భూమి.. నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నేతలు అయ్యాజీ వేమా, కర్రి చిట్టిబాబుల పర్యవేక్షణలో గ్రామంలో ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఢిల్లీలో స్మృతి వనం నిర్మాణంలో భాగంగా ప్రతి గ్రామం నుంచి సేకరించిన మట్టిని పంపుతున్నామన్నారు. నియోజకవర్గ కన్వీనర్ యాండ్ర బుల్లబ్బులు, కోకన్వీనర్ సలాది శేఖర్, నాయకులు అల్లం రామకృష్ణ, పెయ్యల రాంబాబు, శ్రీవెంకటేశ్వర జూనియర్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు అమృత కలశయాత్ర

ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా గురువారం మధ్యాహ్నం 2 గంటలకు రామచంద్రపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అమృత కలశ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.కీర్తి స్పందన తెలిపారు. ఎంపీపీ అంబటి భవాని ఆధ్వర్యంలో జరుగనున్న కార్యక్రమంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు తదితరులు హాజరుకావాలని కోరారు.

క్రీడాకారులకు బీసీ సంఘం సత్కారం



వినయ్, రామారావులను సత్కరిస్తున్న జాతీయ బీసీ సంఘం నాయకులు

మండపేట: సౌతాఫ్రికాలో జరిగిన వరల్డ్ టెన్నికాయిట్ చాంపియన్ షిప్ పోటీల్లో భారత్‌కు గోల్డ్ మెడల్ సాధించిన మండపేట క్రీడాకారులు వడ్డాది వినయ్, పిల్లి రామారావులను బుధవారం జాతీయ బీసీ సంఘం ఘనంగా సత్కరించింది. స్థానిక పెద్ద కాలువ వంతెన సమీపంలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద సంఘ జిల్లా అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సంఘ క్రమశిక్షణ చైర్మన్ కోన సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను సత్కరించారు. జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించి బంగారు పథకం సాధించడం ద్వారా మండపేటకు మంచి గుర్తింపు తెచ్చారని వినయ్, రామారావులను అభినందించారు. సంఘ నాయకులు వీరమల్ల శ్రీనివాసు, పెంకే గంగాధర్, మల్లువలస గణపతి, పిఠాపురం సత్యనారాయణ, అత్తిలి సత్యనారాయణ కోటిపల్లి కృష్ణ, విన్నకోట ప్రసాదు, బవిరి సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి



అద్దంకివారిలంకలో ప్రభుత్వ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ సత్యవేణి

కపిలేశ్వరపురం: ప్రాధాన్యతా క్రమంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి తెలిపారు. అద్దంకివారిలంకలో నిర్మాణంలో ఉన్న సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్ భవనాల నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఆమె వెంట వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కొండేటి వెంకటేశ్వరరావు, మండల సాగు సలహా మండలి సభ్యులు మేడిశెట్టి దుర్గారావు పాల్గొన్నారు.

నేత్రదానం



జగన్‌మోహన్‌రెడ్డి

రాయవరం: రాయవరానికి చెందిన పడాల జగన్‌మోహన్‌రెడ్డి మరణానంతరం చేసిన నేత్రదానం మరో ఆరుగురికి కంటి చూపును ప్రసాదించనుంది. నూతన టెక్నాలజీ ద్వారా ఆరుగురు అంధులకు చూపు నిచ్చే ఒక మంచి కార్యక్రమంగా తూర్పుగోదావరి జిల్లా వలంటరీ బ్లడ్ అండ్ ఐ డోనర్స్ క్లబ్ చైర్మన్ వెలగల ఫణికృష్ణారెడ్డి తెలిపారు. నేత్రదానానికి అంగీకరించిన జగన్‌మోహన్‌రెడ్డి కుమారుడు భాస్కరరెడ్డి, కుటుంబ సభ్యులు, సహకారం అందించిన పడాల కమలారెడ్డి, మల్లిడి రాఘవరెడ్డి, నల్లమిల్లి కోదండం తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి వేణు పరామర్శ



అన్నాయిపేటలో పెమ్మిరెడ్డి రామకృష్ణ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి వేణు

కాజులూరు: నామవానిపాలెంలో రెండు రోజుల కిందట అనారోగ్యంతో జర్నలిస్ట్ మాత గౌతమ్‌రాజు మృతిచెందగా ఆ కుటుంబాన్ని బుధవారం రాష్ట్ర బీసీ సంక్షేమ సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖామంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పరామర్శించారు. నాయకుడు నరేన్, సర్పంచ్ భూపతిరాజు వెంకట సూర్యనారాయణరాజు, పార్టీ మండల ఎస్సీ సెల్ కార్యదర్శి ముడుకు రాంజీ పాల్గొన్నారు.

రామచంద్రపురం: స్థానిక పదో సచివాలయ 22వ వార్డు వలంటీర్ నల్లమటి అనంతలక్ష్మి భర్త నల్లమాటి సత్యనారాయణ గుండెపోటుతో మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని మంత్రి పరామర్శించి వైఎస్సార్ బీమా పథకంలో రూ.10 వేలను అందజేశారు. ఇటీవల మరణించిన కార్మిక సంఘాల నాయకుడు లోవకొండ కుటుంబాన్ని, బ్రాడీపేటకు చెందిన వస్త్ర వ్యాపారి గిరి నానమ్మ మృతి చెందటంతో ఆ కుటుంబ సభ్యులను మంత్రి ఓదార్చారు. పార్టీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: అన్నాయిపేట మాజీ సర్పంచ్ పెమ్మిరెడ్డి రామకృష్ణ ఇటీవల మృతిచెందగా ఆ కుటుంబాన్ని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పరామర్శించారు. రామకృష్ణ కుమారుడు పెమ్మిరెడ్డి మురళీకృష్ణ, సోదరుడు, గ్రామ సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. నియోజకవర్గ శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు నరాల ఏడుకొండలు, వైస్ ఎంపీపీ శాకా బాబీ, ఉప సర్పంచ్ చల్లా బుజ్జి పాల్గొన్నారు.